క్లుప్తంగా

నారాయణస్వామి ఆదాయం రూ.2.54 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.2,54,213 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1.01 లక్షలు, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.30,150, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.1,12,031, ఇతర విరాళాల కింద రూ.11,032 అందజేశారన్నారు. అన్నదానానికి పశ్చిమ గోదావరిజిల్లా తణుకు వాస్తవ్యులు మాదవరపు నారాయణ సుబ్బలక్ష్మి దంపతులు రూ.25 వేల విరాళం ఇచ్చారన్నారు. కొమ్మినేని వెంకట్రావు, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

పంపిణీకి పచ్చిరొట్టవిత్తనాలు సిద్ధం

పీసీపల్లి: మండలంలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారి వెంకటస్వామి తెలిపారు. సోమవారం నుంచి రైతులు పట్టాదారు పాసు పుస్తకాలతో రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

తప్పిన ప్రమాదం


అదుపుతప్పి బోల్తాపడిన కారు

ఉలవపాడు: అదుపుతప్పి కారు ఫెన్సింగ్‌ను ఢీకొట్టి గుంతలో పడింది. ఈ సంఘటన జాతీయరహదారిపై ఉలవపాడు దక్షిణ బైపాస్ సమీపంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు సుజాతానగర్‌కు చెందిన కామేష్ తన భార్యతో కలసి ఒంగోలు నుంచి కావలి వెళుతున్నారు. ఉలవపాడు వద్దకు వచ్చేసరికి మలుపు వద్ద ఫెన్సింగ్‌ను ఢీకొట్టి గుంతలోపడిపోయింది. ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. వేరే వాహనంలో వెళ్లిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26.8 మి.మీ వర్షపాతం నమోదు

కనిగిరి రూరల్: కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాల్లో మంగళవారం 26.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా, సరాసరిన 2.0 మి.మీ నమోదైనట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో కనిగిరి మండలంలో 2.0 మి.మీ, హెచ్‌ఎంపాడులో 4.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. మిగిలిన మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు.

ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేద్దాం


వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్


మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్, పక్కన కమిషనర్ టీవీ రంగారావు

● చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పాలకవర్గం అంతా పట్టణాభివృద్ధికి సమష్టి ప్రణాళికతో ముందడుగు వేద్దాం అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక చైర్మన్ ఛాంబర్‌లో సోమవారం కమిషనర్ టీవీ రంగారావు, మున్సిపల్ పాలకవర్గ ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు పలు సమస్యలను చైర్మన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణ చర్యగా వార్డులోని అన్ని స్తంభాలకు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, తీవ్ర నీటిఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తక్షణం బోర్ల మరమ్మతులు, డీప్ బోర్ల ఏర్పాటు చేయాలని తెలిపారు. వివిధ గ్రాంట్ల కింద మంజూరై కోవిడ్, ఎన్నికల కోడ్, తదితర సమస్యలతో ఆగిన వర్కులను కాంట్రాక్టర్లు త్వరగా చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తక్షణ చర్యగా వీధి లైట్లు, నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. అలాగే పట్టణంలో ఆదాయ వనరుల పెంపునకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలో వివిధ కారణాలతో కుంటుపడిన అభివృద్ధి పనులు వేగవంతం చేయడంలో అధికారులు ప్రణాళికగా పనిచేయాలన్నారు. జనరల్ ఫండ్, ఇతర నిధుల వినియోగంలో ప్రాధాన్యత క్రమంలో పనులకు నిధులు కేటాయించాలన్నారు. తద్వారా పట్టణంలో ప్రధాన సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాచపుడి మాణిక్యరావు, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, శ్రీరాం సతీష్, పాతిరెడ్డి రాజారెడ్డి, దేవకి రాజీవ్, ఎర్రబల్లి దేవరాజ్, రామనబోయిన ప్రశాంతి శ్రీను, సయ్యద్ రిజ్వానా ఖాలక్, ఎస్‌కే ఖాశిం సాహెబ్, పెన్నా ఏడుకొండలు, జాస్మిన్ ఆజాద్, నక్కా రామకృష్ణా, దాసరి మురళీ, చింతం శ్రీను, ఎస్‌కే ఖాజా, పసుపులేటి అరుణోధర్, దేవకి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

కనిగిరి రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలో జరుగుతున్న మొబైల్ రేషన్ పంపిణీని సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ పరిశీలించారు. కార్డుదారులతో మాట్లాడి ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే సరుకులు పూర్తి స్థాయిలో ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. కొలతల్లో తేడాలు చేసినా, అక్రమాలకు పాల్పడినా తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్థానిక నాయకులు చీయాద్రి సుబ్బారావు, శ్రీనివాసులు, మురళీ కృష్ణా తదితరులు పాల్గొన్నారు.


రేషన్ పంపిణీని తనిఖీ చేస్తున్న చైర్మన్ గఫార్

పారిశుధ్య ఫిర్యాదులపై తక్షణం స్పందించండి

కనిగిరి రూరల్: పారిశుధ్య సమస్యలపై పట్టణ ప్రజలు చేసే ఫిర్యాదులపై మున్సిపల్, సచివాలయ సిబ్బంది తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 11వ వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ సమస్య పరిష్కారంలో భాగంగా సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి కాలనీవాసులు పారిశుధ్యం, చిల్లచెట్లు, ఇళ్ల మధ్య మురికి నీల్వ ఉండటం, కాలువలు లేకపోవడం వంటి సమస్యలను చైర్మన్ గఫార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన చైర్మన్ గఫార్ తక్షణ చర్యగా మున్సిపల్ కార్మికులతో పారిశుధ్య కార్యక్రమాలు చేయించారు. వార్డుల్లో వచ్చే పారిశుధ్య ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవాలని శానటరీ సెక్రటరీని ఆదేశించారు. ఇళ్ల మధ్యలో మురుగునీరు నిల్వ లేకుండా త్వరితగతిన డ్రైనేజీ కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. శానిటరీ సెక్రటరీ కాశీరాజు, నాయకులు మురళీ, శ్రీను పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన కదిరి, బన్నీ


వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో కదిరిబాబురావు


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వైఎం ప్రసాద్‌రెడ్డి

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు,పీడీసీసీబీచైర్మన్‌వైఎం ప్రసాద్‌రెడ్డి సోమవారం కలిశారు. విజయవాడ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన వారు నియోజకవర్గానికిసంబంధించినపలు విషయాలు ఆయనతో చర్చించారు. కనిగిరి రూరల్

పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి


గుడ్లూరులో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న సాయి ప్రియాంక

గుడ్లూరు: గర్భిణులు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల పుట్టే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్యాధికారి సాయి ప్రియాంక అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజన కింద 36 మంది గర్భిణులకు సాయి ప్రియాంక సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రసవం అయ్యే వరకు ప్రతి నెలా వైద్యశాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. తల్లి బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలంటే వైద్యశాలల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. ఇంటి వద్ద ప్రసవాలు చేయించుకోరాదన్నారు. 36 మంది వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందచేశారు. హైరిస్క్ ఉన్న 8 మందికి ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సాయి ప్రియాంక వివరించారు. సీహెచ్‌ఓ భాస్కరరావు, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

15 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద

వలేటివారిపాలెం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత సురక్ష యోజన కార్యక్రమంలో భాగంగా 15 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రియంవద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృత సురక్ష యోజన కార్యక్రమం ప్రతి ఒక్క నెల 9,10 తేదీల్లో ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహిస్తామని ఆమె తెలిపారు. గర్భిణులకు బీపీ, సుగర్, రక్త పరీక్ష, యూరిన్ పరీక్షలు వంటి పరీక్షలు చేస్తారన్నారు. వర్షాల నేపథ్యంలో గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యశాల రికార్డులు పరిశీలించారు. సీహెచ్‌ఓ శివరామయ్య, ఏఎన్‌ఎంలు పద్మ, మాలిని, ఆశావర్కర్ సుజాత తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి


వంటలపై కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సింగరాయకొండ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద నాణ్యమైన, పోషక విలువలు గల రుచికరమైన భోజనం పెట్టాలని ఎంఈఓ బి.శివన్నారాయణ పేర్కొన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు నాణ్యమైన, పోషక విలువలు గల భోజనం తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. ఎంఈఓ–2 ఆవుల శ్రీనివాసులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా


మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేష్‌కుమారి

సింగరాయకొండ: కోరం లేకపోవడంతో సింగరాయకొండ మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మండలంలో ఎంపీటీసీ సభ్యులు 19 మంది ఉన్నారు. సర్వసభ్య సమావేశానికి తప్పనిసరిగా 10 మంది ఎంపీటీసీలు తగ్గకుండా హాజరుకావాలి. కానీ సమావేశానికి ఎంపీపీ కట్టా శోభారాణి, వైస్ ఎంపిపి షేక్ షకీలా, శానంపూడి ఎంపీటీసీ ఆదిపోగు సుమతి మాత్రమే హాజరు కాగా మిగిలిన సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేశామని, మంగళవారం కూడా సభ్యులు హాజరు కాకపోతే నిరవధికంగా వాయిదా వేస్తామని ఎంపీడీఓ నాగేష్‌కుమారి స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని ఎంపీటీసీ సభ్యులతో మాట్లాడి సమావేశానికి హాజరయ్యేలా చూడాలని చెప్పారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనం అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, పక్క మండలాల్లో త్వరితగతిన గౌరవ వేతనం ఇస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓను మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ సర్దార్ కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ యన్నాబత్తిన అరుణ, వివిధ శాఖలకు చెందిన మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ఉత్సవం


అభిషేకానంతరం విశిష్ట పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ, నాయకులు


ఆలయ ఉత్సవంలో పాల్గొన్న అర్చకులు, కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో సోమవారం నారాయణస్వామికి అభిషేకోత్సవం, ఆలయ ఉత్సవం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నారాయణస్వామి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ స్వామిని పల్లకీపై ఉంచి ఆలయ ఉత్సవం నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, పలువురు తదితరులుపాల్గొన్నారు.

కనుమళ్ల సహకార సొసైటీ చైర్మన్ రాజీనామా

సింగరాయకొండ: కనుమళ్ల సహకార సొసైటీ చైర్మన్ మలినేని వెంకటేశ్వర్లు సోమవారం తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తనను సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా నియమించగా, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో రాజీనామా చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండపి(సింగరాయకొండ): ప్రభుత్వ వసతి గృహాల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కొండపి ఏఎస్‌డబ్ల్యూఓ దానయ్య తెలిపారు. కొండపి పరిధిలో 6 ప్రీమెట్రిక్ బాలుర వసతి గృహాలు, 2 ప్రీమెట్రిక్ బాలుర వసతి గృహాలు ఉన్నాయన్నారు. ఇందులో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వసతి గృహాల్లో అడ్మిషన్లు కావాల్సిన విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకుని కొండపి పరిధిలోని వసతి గృహాల వార్డెన్లను సంప్రదించాలని సూచించారు. 2023–24 విద్యా సంవత్సరంలో 90 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా అందులో 71 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

ఉచిత కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

కొండపి(సింగరాయకొండ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత కోర్సులను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. కొండపిలోని స్కిల్ హబ్ సెంటర్ ద్వారా స్వీయింగ్ మెషీన్ ఆపరేటర్ (టైలరింగ్), డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మూడు నెలలపాటు ఉచిత శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అన్నారు. పదో తరగతి, ఐటీఐ చదివి 16 నుంచి 40 ఏళ్ల వయసున్న వారు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 15వ తేదీలోగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం.గోపికృష్ణ 8897964505ను సంప్రదించాలని తెలిపారు.

పొగాకు సరాసరి ధర రూ.283.01


వేలం నిర్వహిస్తున్న సునీల్‌కుమార్

కొండపి(సింగరాయకొండ): కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ.283.01 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. వ్యాపారులు నేతివారిపాలెం, రామచంద్రపురం గ్రామాలకు చెందిన రైతులు 1,222 బేళ్లు తీసుకురాగా అందులో 1141 బేళ్లు కొనుగోలయ్యాయి. వివిధ కారణాలతో వ్యాపారులు 81 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.330, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.283.01 పలికింది. వేలంలో 23 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

తైక్వాండోతో బాలికలకు ఆత్మరక్షణ


10కెడిపి44 : తైక్వాండో విద్యను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


బ్లాక్‌బెల్ట్ అందజేస్తున్న ఎస్సై కృష్ణబాజి బాబు

కొండపి(సింగరాయకొండ): ఆడపిల్లల ఆత్మరక్షణకు తైక్వాండో దోహదపడుతుందని కొండపి ఎస్సై కృష్ణబాజీ బాబు పేర్కొన్నారు. సోమవారం కొండపి మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ మన ఊరి వికాసం ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో వేసవి శిక్షణ ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి, విద్యార్థుల నైపుణ్యం మెరుగుపరిచేందుకు ఎన్‌ఆర్‌ఐలు ధర్మవరపు ప్రసాద్, బెజవాడ వెంకట్ తదితరులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. తైక్వాండో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ అంతర్జాతీయ ఐటీఎఫ్ మెంబర్ మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ.. ఉత్సాహం ఉన్న గ్రామీణ యువతీయువకులకు ఉచితంగా తైక్వాండో శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి చాంపియన్లుగా తయారు చేయడమే తమ లక్ష్యమన్నారు. కట్టావారిపాలెం గ్రామంలో శిక్షణ పొందిన విద్యార్థులు గతంలో రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ వేసవి సెలవుల్లో జిల్లాలో పది ప్రాంతాల్లో సుమారు రెండు వందల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా గ్రామంలో సేవాకార్యక్రమాలు చేస్తున్న కార్యకర్తలను అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణబాజీ బాబు తైక్వాండో శిక్షకులకు, విద్యార్థులకు బ్లాక్ బెల్టులు ప్రదానం చేశారు. తదనంతరం విద్యార్థులు తైక్వాండో విద్యను ప్రదర్శించారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు పవన్, బాలాజీ, లీలా మైత్రి, శ్రీనివాస్, గ్రామ పెద్దలు రావెళ్ల చెంచయ్య, బొక్కిసం సుబ్బారావు, కట్టా రవణయ్య, రంగయ్యగారి వెంకటేశ్వర్లు, లాయర్ చెంచురామయ్య, గుంటుపల్లి పద్మావతి, అద్దేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

ప్రజా సమస్యలపై సబ్ కలెక్టర్ ప్రత్యేక దృష్టి

కందుకూరు : క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సబ్‌కలెక్టర్ జి.విద్యాధరి నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేటి నుంచి మండలాల వారీగా ప్రజా సమస్యలపై ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్జీలు స్వీకరించనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం లింగసముద్రం మండలంలో ప్రజా సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీరించనున్నారు. లింగసముద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే శిబిరంలో సబ్‌కలెక్టర్‌తో పాటు, మండల స్థాయి అధికారులు పాల్గొననున్నారు. అలాగే ఈనెల 12న ఉలవపాడులోని వెలుగు కార్యాలయం, 13న వలేటివారిపాలెంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగే శిబిరాల్లోను ఆమె పాల్గొంటారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలపై ఆమె అర్జీలు స్వీకరించనున్నారు. దీనిపై ఆయా మండలాల్లోని గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని మండల ఎంపీడీఓ, తహసీల్దార్‌లకు ఆమె సూచించారు. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పరిష్కరించడమే లక్ష్యంగా కార్యక్రమానికి సబ్‌కలెక్టర్ విద్యాధరి శ్రీకారం చుట్టారు.

నేడు ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

లింగసముద్రం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. కార్యక్రమానికి కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి పాల్గొని అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉన్న వారు సబ్‌కలెక్టర్‌కు అర్జీల రూపంలో విన్నవించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.